


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510


**మున్సిపల్ ఎన్నికల్లో...వైసీపీతో కలిసి ఎస్ డి పి ఐ, ఐ యు ఎం ఎల్ పార్టీలు ఫ్యాన్ గుర్తుపై పోటీ..**




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 296 పేజీలు - 08 వెల - 05/- శుక్రవారం 23-10-2026


పాత ఒప్పందాలను వేగవంతం

# చేయాలి

- గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం



రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (రాఘ్రాదీ) 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా,

మిగతాది 2లో

# ఏపీలో 100 పట్టణ

## స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు.. సుప్రీంకోర్టు

**ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల**

- నవంబర్ 1న పోలింగ్, 3వ తేదీన ఓట్ల లెక్కింపు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నిర్ణయం
- కడప, తిరుపతి సహా నాలుగు చోట్ల తిరిగి నామినేషన్లకు అవకాశం



సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటీవల నామినేషన్ల పర్వంలో వివాదాలు

మిగతా 2లో

## బీసీ కులగణనలో తప్పులుంటే

# సరిచేస్తాం..

**వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ**

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ



బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న

మిగతాది 2లో

# సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి..

- సౌదీలోని దమ్మామ్ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారుల దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయుడు, ఒక సౌదీ పౌరుడు మృతి
- యెమెన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం విఫలమవడంతో పెరిగిన దాడులు
- సౌదీ చమురు, పౌర సదుపాయాలపై దాడులు తీవ్రతరం చేసిన హౌతీలు



# మరో 30 ఏళ్లు

## అధికారం రాదు: రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం
- రాహుల్ విదేశీ పర్యటనలపై బీజేపీ నేతల వరుస ఆరోపణలు





# 'నోబెల్' రాలేదని

## అసంతృప్తి.. ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

- తనకు పులిట్జర్ రావాల్సిందని ట్రంప్ వ్యాఖ్య
- నోబెల్ శాంతి బహుమతి కూడా రాలేదని అసంతృప్తి
- రష్యా దర్యాప్తు కథనాలు తప్పుగా ఉన్నాయని ఆరోపణ
- ట్రంప్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వ్యంగ్య పోస్టులు
- 2026 పులిట్జర్ అవార్డుల్లో ట్రంప్ ప్రభుత్వంపై కథనాలకు గుర్తింపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో అవార్డు కావాలట! యుద్ధాలు ఆపినందుకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని పదేపదే చెబుతున్న ఆయన.. ఇప్పుడు పులిట్జర్ పురస్కారంపైనా తనకు హక్కు ఉందంటున్నారు. నేను రాసిన రచనలకుగానూ ఆ అవార్డు రావాల్సిందని వ్యాఖ్యానించారు. దక్షిణ కరోలినాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పెండిల్టన్‌లోని టీ.ఈడీ గారిసన్ అరేనాలో జరిగిన సభలో ట్రంప్ మీడియాపై విమర్శలు గుప్పించారు. రష్యా దర్యాప్తునకు

మిగతాది 2లో

# డిండికి నీటి తరలింపు ఆపండి

## :మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన



డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారుసుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో

మిగతాది 2లో

# వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్..!

- పరిషత్ ఎన్నికల నామినేషన్ల వేళ కడపలో తీవ్ర ఉద్రిక్తత
- పులివెందుల వెళ్తుండగా మార్గమధ్యంలో అరెస్ట్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని పోలీసుల హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పర్వం అగ్గి రాజేస్తోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచే మొదలైన ఉద్రిక్తతలు ఈరోజు తార స్థాయికి చేరాయి. వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పోలీసులు కాసేపటి క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కడప జిల్లాలో ఒక్కసారిగా

మిగతాది 2లో



# టీడీపీకి షాక్..

- జగన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే
- భర్త విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని టీడీపీపై తీవ్ర ఆరోపణలు
- ప్రజలకు మంచి చేయాలనే వైసీపీలో చేరానని వెల్లడి



టీడీపీకి శ్రీకాకుళం జిల్లాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మిగతాది 2లో

# డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు?

- డ్రైవింగ్ ట్యుటోరియల్ ఉత్తీర్ణత మార్కులు 75 శాతానికి పెంపు ప్రతిపాదన
- ట్యుటోరియల్ కనీస వ్యవధి 30 నిమిషాలు
- ఆధార్ ఆధారిత నిర్దిష్ట ఆన్‌లైన్ సేవలకు ఫీజు మినహాయింపు ప్రతిపాదన
- లైసెన్స్ వివరాల మార్పు దరఖాస్తులపై 15 రోజుల్లో నిర్ణయం
- చిరునామా మార్పుపై 30 రోజుల్లో నిర్ణయం లేకుంటే ఆమోదమైనట్లే
- తుది నోటిఫికేషన్ తర్వాతే కొత్త నిబంధనలు అమల్లోకి



డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలను మరింత కఠినతరం చేస్తూనే కొన్ని సేవలను సులభతరం చేసే దిశగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ పరీక్షలో ఉత్తీర్ణత మార్కులను పెంచడం, ఆధార్ ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో పొందే నిర్దిష్ట సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వడం ఇందులో ఉన్నాయి. లైసెన్స్‌పై పేరు, చిరునామా వంటి వివరాల మార్పునకు కూడా ఫీజు వసూలు చేయకూడదని ప్రతిపాదించింది. ఈ మార్పులపై కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

**డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణత మార్కులు పెంపు**

ప్రస్తుతం సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ అంచనాలో 60 శాతంగా ఉన్న ఉత్తీర్ణత మార్కులను 75 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు ఉండాలి. డ్రైవింగ్ భద్రతపై అవగాహన పెంచడం, అంచనా

మిగతాది 2లో

# డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు?

డ్రైవింగ్ భద్రతపై అవగాహన పెంచడం, అంచనా విధానాన్ని మరింత కఠినతరం చేయడం ఈ ప్రతిపాదనల లక్ష్యం.

**లైసెన్స్ వివరాల మార్పునకు గడువు**

డ్రైవింగ్ లైసెన్స్‌పై పేరు, చిరునామా వంటి వివరాలను మార్చుకునేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని క్రమబద్ధీకరించాలని ముసాయిదాలో పేర్కొన్నారు. దరఖాస్తులను 15 రోజుల్లో ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. తిరస్కరిస్తే అందుకు కారణాలను తెలియజేయాలి. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లో నిర్ణయం తీసుకోకపోతే అది ఆమోదం పొందినట్లుగా పరిగణించాలని ప్రతిపాదించారు.

**ఆధార్ సహా పలు ధ్రువీకరణ పత్రాలు**

గుర్తింపు, వయసు, నివాస ధ్రువీకరణకు ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు గుర్తింపు కార్డు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించుకోవచ్చు. మూడు నెలలకు మించని విద్యుత్ బిల్లు, గ్యాస్ బిల్లును చిరునామా ధ్రువీకరణగా సమర్పించే అవకాశం కూడా ప్రతిపాదించారు. అయితే ఎల్ఐసీ పాలసీని ధ్రువీకరణ పత్రంగా అంగీకరించబోరని ముసాయిదాలో పేర్కొన్నారు. లైసెన్స్ రెన్యువల్, డూప్లికేట్ లైసెన్స్, కొత్త వాహన తరగతి జోడింపు, వ్యక్తిగత వివరాల మార్పు వంటి సేవలకు ఒకే దరఖాస్తు ఫారాన్ని తీసుకురావాలని ప్రతిపాదించారు. అందుబాటులో ఉన్న దరఖాస్తుదారుల వివరాలను సారథి పోర్టల్ నుంచి ఎలక్ట్రానిక్ విధానంలో సేకరిస్తారు.

లైసెన్స్‌లోని వాహన తరగతిని తొలగించాలని దరఖాస్తు చేస్తే ఏడు రోజుల్లో ఆ ప్రక్రియ పూర్తి చేయాలి. అలా శాశ్వతంగా తొలగించిన వాహన తరగతికి సంబంధించి ఏడాది పాటు లెర్నర్ లైసెన్స్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదు. ఈ ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సూచనలు తెలియజేయడానికి సంబంధిత వర్గాలకు 30 రోజుల గడువు ఇచ్చారు. తుది నోటిఫికేషన్ వెలువడిన తర్వాతే కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి.

# మరో 30 ఏళ్లు అధికారం రాదు : రాహుల్‌పై అమిత్ షా ఫైర్

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది.

ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది.

ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది.

ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు.

ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.

తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ㅁ

తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# టీడీపీకి షాక్..

గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీకి సేవలందించిందని, కానీ చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినా అన్నీ కోల్పోయామని వాపోయారు. తన భర్త, దివంగత నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ పార్టీలో అవమానాలు ఎదుర్కొన్నారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు కనీసం పరామర్శించేందుకు కూడా టీడీపీ అధినేత రాలేదని ఆమె విమర్శించారు. తన భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే, స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారని, విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెలను కూడా ధ్వంసం చేశారని గుండ లక్ష్మీదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని,

అందుకే ఎంతో బాధతో పార్టీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించినా పార్టీలోనే కొనసాగామని, అయినా తమను దూరం పెట్టారని అన్నారు. ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవిని ఆమె ఆశించగా, పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో పరిణామాలు వేగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైసీపీ నేతలు ఆమెను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. కూటమి పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని, వారికి మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానని లక్ష్మీదేవి తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో పనిచేశానని, వైసీపీలో కూడా జగన్ నాయకత్వంలో అదే నిబద్ధతతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

## ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు.. సుప్రీంకోర్టు

ఇటీవల నామినేషన్ల పర్వంలో వివాదాలు తలెత్తిన నేపథ్యంలో కడప, తిరుపతి కార్పొరేషన్లతో పాటు రాజంపేట, మైదుకూరు మున్సిపాలిటీలలోని కొన్ని వార్డులకు సంబంధించి తిరిగి నామినేషన్లు స్వీకరించాలని ఈసీ నిర్ణయించింది. ఈ నాలుగు పట్టణాల పరిధిలో అక్టోబర్ 23, 24 తేదీల్లో మళ్లీ నామినేషన్లు స్వీకరించనున్నట్లు పునేఠా తెలిపారు. అక్టోబర్ 25న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వివరించారు. తిరిగి నామినేషన్లకు అవకాశం కల్పించిన వార్డుల వివరాలను కూడా ఈసీ వెల్లడించింది. దీని ప్రకారం కడప కార్పొరేషన్‌లో 11 వార్డులు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులు, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులు, మైదుకూరు మున్సిపాలిటీలో 32 వార్డులకు ఈ ప్రక్రియ వర్తించనుంది. ఈ షెడ్యూల్ విడుదలతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే పరిస్థితిని చక్కదిద్దారు.



రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది

## 'నోబెల్' రాలేదని అసంతృప్తి.. ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

(మొదటి పేజీ తరువాయి)

సభలో ట్రంప్ మీడియాపై విమర్శలు గుప్పించారు. రష్యా దర్యాప్తునకు సంబంధించిన కథనాలకు పులిట్జర్ అవార్డులు అందుకున్న జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకున్నారు. వారి కథనాలు తప్పుల తడకగా ఉన్నాయని ఆరోపించారు. ఆ అవార్డులు అందుకున్నవారికి అవి దక్కాల్సింది కాదని వ్యాఖ్యానించారు. తనకు నోబెల్ శాంతి బహుమతి రాలేదని, పులిట్జర్ కూడా ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన రచనలకుగానూ తనకు పులిట్జర్ రావాల్సిందని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రచనా నైపుణ్యంపై ఆయన చేసిన వాదనను ప్రశ్నించారు. ఇంగ్లిష్‌లో ఆయన మాట్లాడే తీరును ప్రస్తావిస్తూ సెటైర్లు వేశారు. పులిట్జర్ కోరుకోవడంపై కొందరు ఎగతాళి చేస్తూ పోస్టులు పెట్టారు. 2026 పులిట్జర్ పురస్కారాల్లో ట్రంప్ ప్రభుత్వం, దాని విధానాలపై వచ్చిన కథనాలకు కూడా గుర్తింపు లభించింది. ఫెడరల్ ప్రభుత్వ విభాగాల్లో మార్పులు, ఉద్యోగాల కోతల ప్రభావంపై కథనాలకుగానూ వాషింగ్టన్ పోస్ట్ అవార్డు అందుకుంది. జెఫ్రీ ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన న్యాయశాఖ ఫైళ్ల విడుదలకు దోహదపడిన పరిశోధనాత్మక కథనాలకు వాల్ స్ట్రీట్ జర్నల్‌కు గుర్తింపు దక్కింది. షికాగోలో ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన కఠిన వలసల నిర్బంధ చర్యలపై కథనాలకు షికాగో ట్రిబ్యూన్‌కు అవార్డు దక్కింది.

# వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పోలీసులు కాసేపటి క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కడప జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ వేడి భగ్గుమంది.

**అసలేం జరిగింది?**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పులివెందుల నియోజకవర్గంలో ఉద్రిక్తతలు తలెత్తవచ్చని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో, కడప నుంచి పులివెందులకు బయలుదేరిన ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ ప్రకాశ్ రెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పులివెందులకు వెళ్లరాదని సూచించారు. అయితే, తమ నియోజకవర్గానికి తాము వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ఎంపీ అవినాశ్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో... శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, అవినాశ్ రెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ... "ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న పక్కా సమాచారంతోనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, ఘర్షణలకు ఆస్కారం ఇస్తే ఉపేక్షించేది లేదు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరపడమే మా లక్ష్యం. ఇందులో భాగంగానే నేతలను అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది" అని స్పష్టం చేశారు.

# సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి..

(మొదటి పేజీ తరువాయి)

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు దాడులను మరింత తీవ్రతరం చేశారు. బుధవారం రాత్రి దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ సివిల్ ఏవియేషన్ అథారిటీ నేడు ఒక ప్రకటనలో అధికారికంగా ధ్రువీకరించింది. మృతుల్లో ఒకరు సౌదీ పౌరుడు కాగా, మరొకరు భారతీయుడని అధికారులు తెలిపారు. దాడి కారణంగా విమానాశ్రయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు, పౌర మౌలిక సదుపాయాలపై హౌతీల దాడులు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ఈ దాడుల కారణంగా రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయాన్ని మూసివేయడంతో పాటు సౌదీ ప్రభుత్వం ఓ కీలక పెట్టుబడుల సదస్సును కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ నెలలోనే సౌదీ విమానాశ్రయాలపై జరిగిన వివిధ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 22 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలు మారిటైమ్ దిగ్బంధనం విధించడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియా నుంచి వెళ్లే ఆయిల్ షిప్‌మెంట్లకు ఇది పెద్ద ముప్పుగా మారింది. యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు, ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత జులైలో విఫలమైంది. అప్పటి నుంచి హౌతీలు దాడులను తీవ్రతరం చేశారు. ఒప్పందం ముగిసిన తర్వాత సౌదీ నౌకలు, భూభాగాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన హౌతీలు, సెప్టెంబర్‌లో భారీ దాడికి దిగి ఎర్ర సముద్ర తీరంలోని పలు ప్రభుత్వ ఆధీన ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి ప్రతిగా హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని పలు ప్రాంతాలపై సౌదీ వైమానిక దళం తరచూ వైమానిక దాడులు జరుపుతోంది. ఈ పరస్పర దాడులతో యెమెన్ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

# డిండికి నీటి తరలింపు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ㅁ

# పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని



పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు.

# వార్డు సమస్యల పరిష్కారమే నా ధ్యేయం..

## తోబుట్టువులా సేవ చేస్తా: వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి మంచాల రాజేశ్వరి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో 42వ వార్డు పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారమే



పరమావధిగా తాను పనిచేస్తానని, ప్రతి ఒక్కరికీ తోబుట్టువులా అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి మంచాల రాజేశ్వరి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తన భర్త సుధాకర్ రెడ్డి గత 14 ఏళ్లుగా నియోజకవర్గంలో నిరంతరం ప్రజాసేవలో ఉన్నారని గుర్తుచేశారు. తాను ఈ ప్రాంతంలో గత 38 ఏళ్లుగా నివసిస్తున్నానని, ఇక్కడి స్థానికులందరూ తనకు ఎంతో ఆత్మీయులని పేర్కొన్నారు. వార్డులో నెలకొన్న తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, విద్యుత్ దీపాలు మరియు ఇతర మౌలిక వసతుల కొరతను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని, గెలిచిన వెంటనే వీటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాలను స్వయంగా చూశానని, వార్డులోని ప్రతి గల్లీలో ఉన్న సమస్యను తన సొంత సమస్యగా భావించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, పింఛన్లు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంచాల సుధాకర్ రెడ్డి, అజిత్ రెడ్డి, మోహన్, కాశమ్మ, సంధ్య పోగు శివ, వైయస్సార్సీపి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**-ఎన్‌హెచ్-40పై గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం**

**-మృతుడి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన స్థానికంగా చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నంద్యాల - కర్నూలు ఎన్‌హెచ్-40 రహదారిపై సోమయాజులపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా తెల్లవారుజామున సుమారు 5:00 నుంచి 5:30 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి ఆనవాళ్లు: వయస్సు: సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఎత్తు: దాదాపు 5.5 అడుగులు శరీర రంగు: చామనఛాయ ప్రత్యేక గుర్తులు: కుడి చేతిపై పచ్చబొట్టు ఉంది. ప్రమాదం అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఆచూకీ కనుగొనేందుకు చుట్టుపక్కల పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడంతో పాటు వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం చేరవేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 41వ వార్డులో వైఎస్సార్‌సీపీ జైత్రయాత్ర :సమస్యలపై సమరం.. సంక్షేమమే లక్ష్యం!

- ప్రజల సేవకే నా జీవితం అంకితం: కార్పొరేటర్ అభ్యర్థి భోయ జల్లనగారి రామకృష్ణ గర్జన
- గడపగడపకూ ఫ్యాన్ గుర్తు ప్రభంజనం.. పోటెత్తిన ప్రజాభిమానం!
- అడుగడుగునా పూలవర్షం.. ఘన స్వాగతం పలికిన వార్డు మహిళలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో "వార్డు సమగ్ర పురోగతి, ప్రజల కష్టాల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా రాజీలేని పోరాటం చేస్తా.. ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉండే



నిజమైన ప్రజాసేవకుడిగా నిలుస్తా"నని కర్నూలు నగరపాలక సంస్థ 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి భోయ జల్లనగారి రామకృష్ణ ఉద్ఘాటించారు. ఎన్నికల సమరంలో భాగంగా ఆయన చేపట్టిన ప్రచార జోరుతో వార్డు పరిధిలోని ప్రధాన కూడళ్లు, కాలనీలు కిక్కిరిసిపోయాయి. నాయకులు, అశేష కార్యకర్తల దండుతో కలిసి నిర్వహించిన గడపగడప ప్రచారానికి అడుగడుగునా నీరాజనాలు లభించాయి.

ఈ సందర్భంగా ఓటర్లతో మమేకమవుతూ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజా ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీతో కూడిన అభివృద్ధిని సాధించడమే తన సంకల్పమని స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీల ఆధునీకరణతో పాటు మౌలిక వసతుల కల్పనలో 41వ వార్డును కార్పొరేషన్‌లోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమ పాలనకు పట్టం కడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 'ఫ్యాన్' గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి, చారిత్రాత్మక మెజారిటీతో తనను ఆశీర్వదించాలని రెండు చేతులెత్తి విజ్ఞప్తి చేశారు. ప్రచార ర్యాలీ అడుగుపెట్టిన ప్రతి వీధిలోనూ స్థానిక మహిళలు హారతులు పడుతూ, పూలవర్షం కురిపిస్తూ ఆయనకు బ్రహ్మరథం పట్టారు. యువత, స్థానికులు నినాదాలతో హోరెత్తించారు. ఈ భారీ ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు కదంతొక్కి రామకృష్ణ గెలుపునకు ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు.

## ఎంపీటీసీ / జడ్పిటిసి నామినేషన్ల సందర్భంగా

# జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు.

**ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ.**






పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా జెడ్ పి టి సి/ఎం పి టి సి నామినేషన్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాలమేరకు అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం, నూనెపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగినంత పోలీసు సిబ్బందిని నియమించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని , నామినేషన్ జరుగు పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమెరాలతో మరియు సి సి కెమెరాలతో నిరంతరం క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏదైనా అనుకోని సంఘటన సంభవించిన పక్షంలో తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించి, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేసినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ ఖాదర్ భాషా , నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి సుస్మిత ఐపీఎస్ సంబంధిత ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# కూటమి సంక్షేమ పథకాలే గెలుపు గుర్రాలు.. కర్నూలులో టీడీపీ ప్రభంజనం!

- కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జోరుగా ప్రచారం
- మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి: కమ్మరి పార్వతమ్మ పిలుపు
- 48వ వార్డులో గడప గడపకూ సైకిల్ మార్క్ ప్రచారం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో "చెప్పాం.. చేస్తున్నాం" అన్న నినాదంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ధీమా వ్యక్తం చేశారు.

పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 48వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, వాసు హోటల్



మెయిన్ రోడ్డు, ఎబినేజర్ చర్చి లైన్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మరి పార్వతమ్మ నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. నగరాభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

ఈ క్రమంలో టీడీపీ కర్నూలు మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష, 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుతారు రాఘవేంద్ర, 49వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి. శివపార్వతిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఓటర్లు తమ అమూల్యమైన ఓటును 'సైకిల్' గుర్తుపై వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పాల్గొన్న నేతలకు వార్డు ప్రజలు, మహిళలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు.

ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇమ్మనియల్, జిన్ను సోమన్న, గురువాచారి, నూర్ అహ్మద్, జగదీష్, భూపాల్, ఖాదర్ వలి, హబీబ్, గడ్డం వెంకటేష్, బాలకృష్ణలతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం: మంత్రి టీజీ భరత్

**వైసీపీని వీడి టీడీపీలో చేరిన 19వ వార్డు, కమేలా ప్రాంతాలకు చెందిన ముస్లిం నాయకులు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కర్నూలు నగరంలోని 19వ వార్డుకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. మంత్రి టీజీ భరత్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ అన్వర్ భాష, షేక్ చాంద్ భాష, షేక్ అబ్బాస్ ఖాన్ తదితరులు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా కమేలా ప్రాంతంతో పాటు కర్నూలు నగరంలోని పలు వార్డులకు చెందిన ముస్లిం నాయకులు కూడా మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు,



కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నగరంలో అభివృద్ధి పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పనిచేసే వారికే ప్రజలు మద్దతు ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, కులమతాలకు అతీతంగా కర్నూలు నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, నగర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు కూటమి మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, కార్పొరేటర్ అభ్యర్థులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో...వైసీపీతో కలిసి

## ఎస్ డి పి ఐ, ఐ యు ఎం ఎల్ పార్టీలు ఫ్యాన్ గుర్తుపై పోటీ..

**కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడమే మా ఏకైక లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు.**
**కూటమి దౌర్జన్యాలపై శిల్పా రవి రెడ్డి ఫైర్.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. "అక్రమ కేసులు పెట్టి భయపెడతారా? జైలుకు పంపి దారికితెచ్చుకుందామనుకుంటున్నారా? ఏమైనా చేసుకోండి... కచ్చితంగా ఎన్నికల బరిలోనే ఉంటాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తాం తప్ప... ఎక్కడా, ఎవరికీ తగ్గేదే లేదు!" అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కూటమి పాలకులకు తీవ్ర హెచ్చరిక చేశారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలపై శిల్పా రవిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్‌డీపీఐ , ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం లీగ్ నేతలు వైఎస్సార్‌సీపీకి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎస్ డి పి ఐ జిల్లా అధ్యక్షుడు అతావుల్లా ఖాన్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో శిల్పా రవిరెడ్డి ప్రస్తుత ఎన్నికల పై మాట్లాడారు.

**దొంగలు చేసినట్లు ఫోర్జరీ సంతకాలతో ఏకగ్రీవాలా?**

కూటమి నేతల దిగజారుడు రాజకీయంపై శిల్పా రవిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "నంద్యాల 51వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అవ్వారి నాగమణి నామినేషన్‌ను ఆమెకు తెలియకుండానే ఉపసంహరించుకున్నట్లు దొంగ సంతకాలు (ఫోర్జరీ) చేసి, ఏకగ్రీవంగా గెలిచినట్లు ప్రకటించుకోవడం ఏ తరహా ప్రజాస్వామ్యం?" అని ప్రశ్నించారు. దొంగల ముఠాలా వ్యవహరించి ఫోర్జరీకి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దిగజారుడు రాజకీయం దారుణమని ధ్వజమెత్తారు.

సుప్రీంకోర్టు తీర్పు... కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు!రాష్ట్రంలో రౌడీయిజంతో ఎన్నికలను ఏకపక్షం చేయాలనుకుంటున్న అధికార పక్షానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, దౌర్జన్యాలను ఆపాలని అత్యున్నత నాయస్థానం ఇచ్చిన ఆదేశాలను తాము పూర్తినమ్మకంతో స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం తన అణచివేత ధోరణిని వీడాలని స్పష్టం చేశారు.

కూటమిని గద్దె దించడమే ప్రధాన ధ్యేయం!లి

ప్రజలకు న్యాయం జరగాలంటే, రాష్ట్రానికి పట్టిన ఈ వెన్నుపోటు ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని శిల్పా రవిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారు. పాలకులు వారి పట్ల వివక్ష, అన్యాయం చూపుతున్నారు. ఈ ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐకమత్యంతో సంఘటితం కావాలన్నారు. పార్టీల కంటే ప్రాంతాల అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే ముఖ్యం అన్నారు. ధైర్యంగా ముందుకు రండి... ఎవరు గెలుస్తారో ఎన్నికల బరిలోనే తేల్చుకుందాం!" అని పిలుపునిచ్చారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసి, 100% సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద మనసుతో తమకు మద్దతుగా నిలిచిన ఎస్‌డీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతలకు, కూటమి ఓటమే లక్ష్యంగా ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికలను నిస్పాక్షపాతంగా నిర్వహించాలి.

**● ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వైఫల్యం. ● కూటమి ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్న అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నిష్పక్షపాతంగా స్వేచ్ఛగా ప్రజలు ఓటు వేసుకొని వాతావరణాన్ని జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగము పోలీసులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టి.రమేష్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా అధికార పార్టీ కూటమికి అనుకూలంగా పోలీసు యంత్రాంగము ఎన్నికల అధికార యంత్రం ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన ప్రతిపక్షాల అభ్యర్థులను బయభ్రంతులకు గురి చేయడం,అధికార పక్షం దాడులకు పాల్పడుతున్న పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు.నామినేషన్లు వేయనీయడం లేదని వైసీపీ ప్రతిపక్షాలు సుప్రీం కోర్టుకు వెళితే అధికార పక్షానికి చివాట్లు పెట్టిన ఇంకా కూటమి ప్రభుత్వానికి సిగ్గు రాలేదన్నారు.రాష్టంలో అధికార పక్షం పోలీసులను అడ్డు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తున్నారన్నారు.నామినేషన్లు వేయడానికి ఎవ్వరు రాకుండా అధికార పార్టీ అడ్డుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.ఆళ్లగడ్డ లో, ఆత్మకూరు మున్సిపాలిటీ లలో ఏకగ్రీవాలు కావడాన్ని ఆయన




తప్పు పట్టారు.60-40 పేరుతో ఏకగ్రీవాలు చేయడం దారుణమన్నారు.ఆత్మకూరు మున్సిపాలిటీలో సిపిఎం అభ్యర్థి పోటీలో ఉంటే అతనిపైన, కుటుంబ సభ్యుల పైన పోలీసుల ద్వారా తీవ్ర ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు.జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, సాధారణ ప్రజలు లేరని అధికారాన్ని అడ్డం పెట్టుకొని కూటమి నేతలు దాడులకు పాల్పడుతున్నారని ఈ చర్యలను రమేష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. నిస్పక్షపాతంగా మున్సిపల్, జడ్పీటీసి, ఎంపీటిసి ఎన్నికలు జరిగేలా చూడాలని ప్రజలు నిర్భయంగా పోలింగ్ బూత్ లకు వచ్చి ఓటు వేసుకునేలా పరిస్థితులు కల్పించాలని ఆయన పోలీస్ అధికారులను కోరారు.నంద్యాల మున్సిపాలిటీ 51 వ వార్డు లో టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవం కావడన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రత్యర్థి అభ్యర్థి ప్రమేయం లేకుండా ఎలా ఏకగ్రీవం చేస్తారని ఆయన ప్రశ్నించారు.జిల్లాలో సిపిఎం పార్టీ తరుపున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని సిపిఎం అభ్యర్థులను గెలిపించి ప్రజా సమస్యలపై గళమెత్తే అవకాశం ప్రజలు ఇవ్వాలని ఆయన కోరారు.విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు, పట్టణ కార్యదర్శి దర్శనం. లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, వెంకట లింగం 24 వ వార్డ్ సీపీఎం అభ్యర్థి శ్రీరాములు. పెద్దయ్య అలియాస్ శివ పాల్గొంటున్నారు.

# కలెక్టర్ ఫొటోతో డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి.

**-9713588183 నంబర్ నుంచి వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.**
**-సైబర్ మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రొఫైల్ ఫొటోను దుర్వినియోగం చేస్తూ డబ్బులు డిమాండ్ చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఫొటోతో 9713588183 నంబర్ నుంచి డబ్బులు కోరుతూ సందేశాలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటువంటి సందేశాలను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని, సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, ఆధారాలతో పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని కోరారు. విచారణలో సైబర్ మోసం నిర్ధారణ అయితే బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్రమత్తంగా ఉండండి.. సైబర్ మోసాలకు గురికాకండి.

# 41వ వార్డులో నాగేశ్వరరావు హామీల జోరు.

**మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా వైసీపీ అభ్యర్థి ప్రచారం.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 41వ వార్డులో




రాజకీయ ప్రచారం ఊపందుకుంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వై.నాగేశ్వరరావు వార్డు అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ పలు హామీలను ఇస్తూ ముందుకెళ్తున్నారు. వార్డులో తాగునీటి సదుపాయాల మెరుగుదల,రహదారులు,డ్రైనేజీ వ్యవస్థ,వీధి దీపాలు,పారిశుధ్యం,పార్కుల అభివృద్ధి తదితర అంశాలను ప్రాధాన్య పనులుగా పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం,స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ లక్ష్యమని ప్రచారంలో వివరించారు.

**అభివృద్ధే ప్రధాన అజెండా..!!**

వార్డులో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభ్యర్థి ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.ప్రజల అవసరాలను గుర్తించి,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో 41వ వార్డులో అభివృద్ధి హామీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.అభ్యర్థి ప్రకటించిన అంశాలు ప్రజల్లో ఎలాంటి స్పందనను తెచ్చుకుంటాయన్నది ఎన్నికల ప్రచారంలో ఆసక్తికరంగా మారింది.

ప్రజా సమస్యల పరిష్కారం,మౌలిక సదుపాయాల కల్పనతో వార్డు అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా 41వ వార్డు వైసిపి అభ్యర్థి వై.నాగేశ్వరరావు ప్రచార సందేశం కొనసాగుతోంది.

# నంద్యాలలో సీపీఐ ఇంటింటి ప్రచారం.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మునిసిపల్ 3వ వార్డు సీపీఐ కౌన్సిలర్ అభ్యర్థి ఎస్. బాబా ఫకృద్దీన్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం నడిగడ్డ, ఫాతిమా నగర్ ప్రాంతాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఫకృద్దీన్ ప్రజలను కలిసి, కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి తన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, సిపిఎం నాయకుడు మాభాష, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఎ. ధనుంజయ్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రియాజ్. కలాం భాష, హుస్సేన్, మదార్ వలి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నంద్యాల జిల్లా ఇమాముల సంఘం(మజ్లిసుల్ ఉలమా వల్ అయిమ్మా నంద్యాల జిల్లా ) తీర్మానం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇమాముల సంఘం నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం, అక్టోబర్ 22న ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల పట్టణ అభివృద్ధి, రాబోయే మున్సిపల్ ఎన్నికలు, పట్టణ ప్రజల భవిష్యత్తు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నంద్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే జనాబ్ ఎన్.ఎం.డి. ఫరూక్ ఆధ్వర్యంలో పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎన్.ఎం.డి. ఫరూక్ నియమించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి, వారిని గెలిపించాలని సమావేశం తీర్మానించినట్లు వెల్లడించారు.

టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా తీర్మానం.

నంద్యాల పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న 52 మంది కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థి డాక్టర్ పి. బాబన్ ని ఓటు వేసి గెలిపించాలని ఇమాముల సంఘం నంద్యాల జిల్లా (మజ్లిసుల్ ఉలమా వల్ అయిమ్మా నంద్యాల జిల్లా ) సమావేశం తీర్మానం చేసింది. పట్టణంలో అభివృద్ధి పనులు కొనసాగడం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం, నంద్యాల సమగ్ర అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని ఓటర్లందరూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఇమాముల సంఘం నాయకులు నంద్యాల జిల్లా విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధిని కొనసాగించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ పి. బాబన్ గారితో పాటు 52 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరినట్లు తెలిపారు. ప్రజల సహకారం, నాయకుల సమన్వయం, అభివృద్ధి పట్ల నిబద్ధతతో నంద్యాల పట్టణాన్ని మరింత ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లవచ్చని సమావేశంలో పాల్గొన్నవారు అభిప్రాయపడినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇమాముల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు జనాబ్ హాఫిజ్ అమ్జద్ బాషా సిద్దీఖీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మౌలానా మహబూబ్ బాషా సాహెబ్ రషాది , హాఫిజ్ అబ్దుల్ సలాం సాహెబ్ సయీదీ,మౌలానా అబ్దుల్ ఖాదిర్ మిఫ్తాహీ,



హాఫిజ్ ఫఖ్రుద్దీన్, మౌల్వీ అబ్దుల్ రవూఫ్,మౌల్వీ అబ్దుల్లాహ్ బాఖవీ, హాఫిజ్ అబ్దుల్ రజాఖ్, హాఫిజ్ అబ్దుల్ రెహమాన్, హాఫిజ్ అబ్దుల్ మజీద్,మౌల్వీ అలీమ్, హాఫిజ్ మహమ్మద్ ఆజమ్, హాఫిజ్ కరీముల్లా తో పాటు పలువురు ఉలమాలు, ఇమాములు, ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యతను వివరిస్తూ, పట్టణ అభివృద్ధి కొనసాగింపులో ప్రజల భాగస్వామ్యం కీలకమని నాయకులు పేర్కొన్నట్లు తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాల అనంతరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేసినట్లు వెల్లడించారు.

## నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి: ఏఎస్పీ




మహానంది, పల్లె వెలుగు ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని నంద్యాల అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ ఖాదర్ భాషా పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అక్కడ చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ శివాంజల్ లను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నామినేషన్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్, నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించేలా చూడాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలన్నారు.

## జెడ్పిటిసి, వైఎస్సార్ పార్టీ అభ్యర్థిగా సుజాతమ్మ నామినేషన్



బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 22: బండి ఆత్మకూరు మండలానికి జెడ్పిటిసి అభ్యర్థిగా వైఎస్ఆర్ పార్టీ తరపున రాజం రెడ్డి సుజాతమ్మ తన నామినేషన్ను దాఖలు చేశారు. గురువారం నంద్యాలలో జిల్లా పరిషత్ సీఈవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. బండి ఆత్మకూరు చెందిన రాజంరెడ్డి సుజాతమ్మ ప్రస్తుతం వైఎస్ఆర్ పార్టీలో నంద్యాల జిల్లా వైయస్సార్ పార్టీ మహిళా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. బండి ఆత్మకూరు మండలం నుండి వైఎస్ఆర్ పార్టీ తరపున నామినేషన్లు వేసేందుకు పలువురు ఆశావాహులు తమ పేర్లను పార్టీకి పంపుకున్నారు. నామినేషన్ వేసేందుకు మాత్రం ఎవరు ముందుకు రాలేదు. గురువారం సుజాతమ్మ నంద్యాలకు వెళ్లి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటైనింగ్ అధికారికి సమర్పించి వచ్చారు. పార్టీ తరపున బీఫారం తనకే లభించే అవకాశం ఉందని సుజాతమ్మ ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది.

## జనరల్ స్థానాలలో మాలలు పోటీ చేయాలి




బనగానపల్లె, అక్టోబర్ 22, పల్లెవెలుగు స్థానిక సంస్థ ఎన్నికల్లో మాలలు రిజర్వేషన్ స్థానాల్లో కాకుండా జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేయాలని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో మాల మహానాడు కార్యాలయంలో సమావేశం జరిగింది ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ ఎంపీటీసీ, సర్పంచ్ ,జడ్పిటిసి ఎన్నికల్లో మాలలు అధికముగా ఉన్న గ్రామాలలో ,మండలాలలో జనరల్ స్థానాలలో పోటీచేయాలన్నారు. మాలలు ఏ రాజకీయ పార్టీలో ఉన్న చైతన్యవంతులు కావాలని కోరారు. మాలలు ఆత్మగౌరవంతో పోరాటం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు .ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు, జిల్లా కార్యదర్శి అంబాపురం పోలేకంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ నుండి 30 కుటుంబాలు టిడిపిలోకి చేరిక.

చాగలమర్రి అక్టోబర్ 22 పల్లె వెలుగు మండల పరిధిలోని గొట్లూరు గ్రామానికి చెందిన వైసీపీ పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాల వారు గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వైయస్సార్సీపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయ జయరామ పెద్దయ్య, బోయ జయరాముడు, బోయ చిన్న పెద్దయ్య, బోయ బాల పెద్దయ్య, బోయ జగదభిరాముడు, బోయ రామ పెద్దన్న, బోయ రామ పెద్దయ్య, గుర్రం శివ, చల్ల రమణతోపాటు సుమారు 30 కుటుంబాల సభ్యులు భూమా యువసేన నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భార్గవ్ రామ్, సమక్షంలో చేరడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జమాల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కన్వీనర్ చక్రవర్తుల పల్లె నరసింహారెడ్డి, టిడిపి నాయకులు భూమా అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జెడ్పిటిసి అభ్యర్థిగా బిజెపి తరపున బిజ్జం'' నామినేషన్




బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 22: బండి ఆత్మకూరు మండలానికి జిల్లా ప్రాదేశిక సభ్యుడిగా బండి ఆత్మకూరు మండలం కాకనూరు గ్రామానికి బిజ్జం సుబ్బారెడ్డిగురువారం తన నామినేషన్ ను దాఖలు చేశారు. నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అభిరుచి మధు మద్దతుతో నంద్యాల జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా పరిషత్ సీఈవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. గత కొద్దిరోజులుగా భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేస్తానని బిజ్జం ప్రకటించారు. ఈ విషయంపై తనకు మద్దతు ఇవ్వాలని ఈనెల 16న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని వేల్పనూరులో కలిశారు. కూటమి ప్రభుత్వం తరపున తనకు అవకాశం కల్పించాలని బిజ్జం ఎమ్మెల్యేను అప్పట్లో అభ్యర్థించడం జరిగింది. నామినేషన్ వేసే అభ్యర్థుల జాబితాలో నీ పేరు కూడా ఉందని ఈ విషయంపై పరిశీలించడం జరుగుతుందని ఎమ్మెల్యే బుడ్డా అప్పట్లో పేర్కొనడం జరిగింది. గురువారం నాడు బిజ్జం నామినేషన్ వేసే సందర్భంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు అభిరుచి మధు స్వయంగా కలిసి మద్దతు ప్రకటించారు. బిజ్జం అభ్యర్థిత్వం ఖరారు చేసే విషయంలో తాను ఎమ్మెల్యేతో కలిసి మాట్లాడడం జరుగుతుందని అభిరుచి మధు పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. విద్యాసంస్థల ప్రతినిధిగా, బిజెపి పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, పేరు ప్రఖ్యాతులు గడించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కూడా తనకు సంపూర్ణంగా మద్దతు ప్రకటించడంతో బిజ్జం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

## సమసమాజ నిర్మాణమే సీపీఎం ధ్యేయం

- ఉచిత విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి కల్పనే ప్రధాన ఎజెండా
- 42వ వార్డు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం
- ఇంటింటి ప్రచారంలో సీపీఎం అభ్యర్థి జి.ధనలక్ష్మి పిలుపు




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయ సాధనే ప్రధాన ఆశయాలుగా సీపీఎం నిరంతరం ప్రజాక్షేత్రంలో పనిచేస్తుందని 42వ వార్డు సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థి జి.ధనలక్ష్మి స్పష్టం చేశారు. గురువారం వార్డు పరిధిలో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ముమ్మరంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వార్డు సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎంను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా జి.ధనలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, మెరుగైన ఉచిత వైద్యం, గౌరవప్రదమైన ఉపాధి హక్కుగా లభించాలని పేర్కొన్నారు. "పేదరికం కారణంగా ఏ ఒక్క చిన్నారి చదువుకు దూరం కాకూడదు; వైద్యం చేయించుకోలేక ఏ ప్రాణమూ గాల్లో కలవకూడదు. నిరుద్యోగ యువతకు సరైన అవకాశాలు కల్పించి, అసమానతలు లేని సమసమాజ నిర్మాణం చేపట్టడమే సీపీఎం లక్ష్యం" అని అన్నారు. గతంలో ప్రజలతో కలిసి పోరాడి వార్డులో పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల సాధనలో విజయం సాధించామని ఆమె గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో అంతర్గత రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ, పేదల శుభకార్యాల కోసం కమ్యూనిటీ హాల్, మహిళా సాధికారతకు కుట్టు శిక్షణా కేంద్రం, యువత విజ్ఞాన వికాసానికి గ్రంథాలయం వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చుకోగలిగామని వివరించారు. భవిష్యత్తులోనూ వార్డు ప్రజల గొంతుకగా నిలిచి సమస్యల శాశ్వత పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని భరోసా ఇచ్చారు.

ఓట్లను కొనే పార్టీలకు బుద్ధి చెప్పాలి: కె.సుధాకరప్ప

పార్టీ నగర కార్యవర్గ సభ్యులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ.. ఎన్నికలను కేవలం డబ్బుతో ముడిపెట్టి ప్రజలను బానిసలుగా మార్చాలని చూస్తున్న స్వార్థ రాజకీయ శక్తులకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కే ఇతర పార్టీల తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పేద, మధ్యతరగతి జీవన ప్రమాణాలు మెరుగుపడి, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నిరంతరం ప్రజా పోరాటాల్లో ముందుండే ధనలక్ష్మిని ఆదరించి గెలిపించాలని కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుసేన్ బాషా, సీపీఎం స్థానిక నాయకులు ఈ.రామాంజనేయులు, షంషీర్, వి.విజయ్ కుమార్, ముక్తియార్, దావీదు, చిట్టిబాబు, బీసన్న, ప్రసాద్, రంగరాజు, కృపవరం, చరణ్, రాము, నారాయణ, వెంకటేష్, అఖిల్, ప్రశాంత్, నాని, మహేష్, చిన్న, మహిళా నాయకురాళ్లు ఓబులమ్మ, దానమ్మ, శారదమ్మ, సాలమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్
- పార్కింగ్, రిసెప్షన్, పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలన
- బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట చర్యలు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థకు సంబంధించి స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి ఐఏఎస్, అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నగర శివార్లలోని అథెనా స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్లు, బ్యాలెట్ బాక్సుల భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు గదులు, అధికారుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం వచ్చే సిబ్బంది, అధికారులు, ఇతర సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాన్ని కేటాయించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు, ఓట్ల లెక్కింపు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు, అధికారుల విధుల నిర్వహణకు అనువైన వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి , డిసిపి శబ్నం శాస్త్రీ, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈ నరేష్, శ్రీనివాసన్, పవన్ కుమార్ రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవమా.. ఉత్కంఠభరిత సమరమా? దేవరగట్టులో రక్తపాతం!

*-దేవరగట్టు బన్నీ వేడుకల్లో ప్రాణనష్టం.. భద్రతా వైఫల్యంపై ఆగ్రహం!*

*-బన్నీ జైత్రయాత్రలో ఒకరు మృతి!200 మందికి పైగా గాయాలు.. 25 మందికి పైగా తీవ్ర గాయాలుహింసను నిలువరించడంలో విఫలమైన పోలీసు యంత్రాంగం..*

హొళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 22 కర్రల







సమరం మరోసారి రక్తసిక్తమైంది. భక్తి పారవశ్యంతో సాగాల్సిన బన్నీ జైత్రయాత్ర విషాదాంతంగా ముగిసింది. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో నిర్వహించిన మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా జరిగిన బన్నీ ఉత్సవంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. వీరిలో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఆలూరు పట్టణానికి చెందిన పోతురాజు, హులేబీడు గ్రామానికి చెందిన మలకన్న ఉన్నారు. మూడో వ్యక్తి వివరాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

ప్రతి ఏటా విజయదశమి సందర్భంగా జరిగే ఈ ఉత్సవం మరోసారి హింసాత్మక ఘర్షణలకు వేదికైంది. సంప్రదాయం పేరుతో జరిగే కర్రల సమరంలో ప్రాణాలు గాలిలో కలుస్తున్నా, గాయాలపాలవుతున్నా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తి, విశ్వాసం, ఆచారాలతో ముడిపడిన ఈ వేడుకలో ప్రాణనష్టం చోటుచేసుకోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

సంప్రదాయం.. సంఘర్షణ.. ప్రాణనష్టం..

దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. విజయదశమి రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలో సంప్రదాయబద్ధంగా కర్రలతో తలపడే కార్యక్రమాన్ని బన్నీ ఉత్సవం లేదా కర్రల సమరంగా పిలుస్తారు. స్వామివారి విగ్రహాలను తమ గ్రామానికి తీసుకెళ్లాలనే పట్టుదలతో వివిధ గ్రామాల భక్తులు గుంపులుగా ఎదురుపడటం ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టంగా కొనసాగుతోంది.

గతంలో స్థానిక ఆచారాలు, గ్రామాల మధ్య సంప్రదాయ పోటీగా సాగిన ఈ కార్యక్రమం కాలక్రమేణా తీవ్ర ఘర్షణలకు దారితీస్తోంది. కర్రల దెబ్బలకు తలలు పగలడం, చేతులు విరగడం, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రుల పాలవడం ఏటా పునరావృతమవుతున్నాయి. అయినప్పటికీ ఉత్సవం సందర్భంగా ఏర్పడే ఉద్రిక్తతలను పూర్తిస్థాయిలో నియంత్రించడం అధికార యంత్రాంగానికి సవాలుగా మారుతోంది.

పోలీసు చర్యలు సరిపోలేదా?

బన్నీ ఉత్సవం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు చేపట్టినప్పటికీ, భారీగా గాయాలు కావడం, ముగ్గురు మృతి చెందినట్లు సమాచారం వెలువడటంతో భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హింసాత్మక ఘర్షణలను ముందుగానే అంచనా వేసి నివారించాల్సిన యంత్రాంగం ఎక్కడ విఫలమైందన్న చర్చ సాగుతోంది.కేవలం బందోబస్తు ఏర్పాటు చేయడం, హెచ్చరికలు జారీ చేయడం మాత్రమే కాకుండా, ప్రమాదకరంగా మారే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, గుంపులను వేరు చేయడం, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోలీసుల చర్యలు, బందోబస్తు స్థాయి, ఘటనలకు దారితీసిన పరిస్థితులపై అధికారిక వివరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాతే బాధ్యతను నిర్ధారించాల్సి ఉంటుంది.

సంప్రదాయం పేరుతో ప్రాణాలు పోవాలా?

భక్తి విశ్వాసాలను గౌరవించడం ఎంత ముఖ్యమో, ప్రజల ప్రాణాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం. తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించాలనే భావనతో ప్రమాదకరమైన ఘర్షణలను సమర్థించలేము. ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూనే రక్తపాతం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు కలిసి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రతి ఏడాది ఘటన జరిగిన తర్వాత గాయపడిన వారికి చికిత్స అందించడం, భద్రతపై సమీక్ష నిర్వహించడం కంటే, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే అసలైన పరిష్కారం. కర్రల సమరంలో పాల్గొనే వారి సంఖ్య, ఆయుధాల వినియోగం, గుంపుల కదలికలు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సుల అందుబాటు వంటి అంశాలపై శాస్త్రీయమైన కార్యాచరణ రూపొందించాలి.

దేవరగట్టు బన్నీ జైత్రయాత్ర ముగిసింది. కానీ ముగ్గురు మృతుల కుటుంబాల్లో విషాదం, గాయపడిన వారి ఇళ్లలో ఆందోళన మిగిలాయి. ఈ రక్తపాతం మరో ఏడాది పునరావృతం కాకుండా అధికారులు, నిర్వాహకులు ఇప్పటికైనా సమగ్ర చర్యలు తీసుకుంటారా,లేక వచ్చే విజయదశమి నాటికి ఇదే విషాదం మళ్లీ పునరావృతమవుతుందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి భవిష్యవాణి...

మల్లెపూలతో పాటు గంగమ్మకు సంబంధించిన ప్రస్తావన ఉందని, పత్తి ధర రూ.7,900, జొన్న ధర రూ.3,400 వరకు ఉంటుందని భవిష్యవాణి వినిపించరు..

# రాజీ ప్రయత్నాలకు బ్రేక్

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 22: బండి ఆత్మకూరు మండలంలో మండల ప్రాదేశిక





సభ్యులకు సంబంధించి ఇరుపార్టీలు రాజీ చేసుకోవాలన్న ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. గురువారం రెండవ రోజు బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే ఎంపిటిసి సభ్యులకు సంబంధించి రెండు పార్టీల మధ్య రాజీ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి అన్న నేపథ్యంలో మధ్యాహ్నం వరకు నామినేషన్ వేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. మధ్యాహ్నం సమయంలో నామినేషన్ల వ్యవహారం బెడిసి కొట్టిందని ఒక పార్టీ నాయకులకు సమాచారం అందింది. దీంతో వైఎస్ఆర్ పార్టీకి చెందిన నాయకులందరూ అన్ని స్థానాలకు పోటీ చేయాలని వైఎస్ఆర్ పార్టీ నేతల నుండి ఆదేశాలు రావడంతో, ఆ పార్టీకి చెందిన నాయకులందరూ నామినేషన్లు వేయడంలో అత్యంత ఉత్సాహం కనపరిచారు. అదే సమయానికి నామినేషన్లు జరుగుతున్న ప్రాంతంలో ఏదో జరగబోతుంది అన్న సమాచారం పోలీసులకు అందింది. ఈ విషయం తెలిసిన వెంటనే నంద్యాల అడిషనల్ ఎస్పీ సుస్మితా రంగనాథన్ , ఏఎస్పి ఖాదర్ బాషా,సిఐ సుధాకర్ రెడ్డి,వెంటనే మూడు గంటల ప్రాంతంలో బండి ఆత్మకూరు చేరుకున్నారు. ఏ.ఎస్.పి సాయంత్రం వరకు ఈ ప్రాంతంలో ఉండి పరిస్థితిని సమీక్షించారు. నామినేషన్ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ఐ జగన్మోహన్ ను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

**రెండవ రోజు 52 నామినేషన్లు**

:బండి ఆత్మకూరు మండలంలో రెండవ రోజు వివిధ పార్టీలకు సంబంధించి 52 నామినేషన్లను దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గురువారం రాత్రి పేర్కొన్నారు. వైఎస్ఆర్ పార్టీకి సంబంధించి ఎన్ని 29 , తెలుగుదేశం పార్టీకి సంబంధించి 17 నామినేషన్లు దాఖలు అయ్యాయి. భారతీయ జనతా పార్టీ నుంచి రెండు, సిపిఎం నుంచి ఒకటి, సిపిఐ నుండి ఒకటి , ఇతరులు రెండు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

# నామినేషన్ పత్రాలు అందుకున్న వై, అనూషమ్మ,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 22 కర్నూలు





జిల్లాలో మంత్రాలయం నియోజకవర్గంలో మంత్రాలయం మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో వైయస్సార్ నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు వై. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైఎస్సార్సీపీ నేత లు వై. ప్రదీప్ రెడ్డి , వై. ధరణీ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ నేత లు జి. భీమారెడ్డి , సి. వి. విశ్వనాథ్ రెడ్డి , లీగల్ సెల్ ప్రతినిధి మాలపల్లి గురురాజారావు స్వామి మరియు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ తరుపున 18 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు.

52 బసాపురం గ్రామం నుంచి వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి సతీమణి అనూషమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. మంత్రాలయం 1

జి. పార్వతి, జి. రాఘమ్మ మంత్రాలయం 2 హొండే సుజాత

తెలుగు పార్వతి, మంత్రాలయం 3: మిడిగిలదిన్నె నరసమ్మ

తెలుగు పార్వతి, చెట్నేహళ్లి

బెస్త ధనలక్ష్మి, మాధవరం 1

గౌళ్ల రంగవేణి, ఓబులమ్మ మాధవరం 2 గుర్రమింటి భీమిరెడ్డి. జగన్నాథ్

52బసాపురం, జయలక్ష్మి కాచాపురం, కె. బ్రహ్మయ్య ఆచారి, ఈరన్న ఆచారి రాంపురం ఎం. పావని, ఎం. నిర్మల, రచ్చుమర్రి 1కురువ ఈరన్న, లింగప్ప

రచ్చుమర్రి 2 సుధాకర్ సుంకేశ్వరి: నాగిరెడ్డి, నర్సిరెడ్డి

మాలపల్లి: ఉసేని, వగరూరు:

బోయ దండు వీరేష్

బోయ దండు నర్సింహులు, బూదూరు: గోవిందమ్మ. సూగూరు: రాజు, గోపీ

కల్లుదేవకుంట:నరసప్ప, విజయ్

చిలకలడోణ బోయ మహేశ్వరి

బోయ ఇందు వేర్వేరు సమయాల్లో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

## యాగంటి మారునీళ్ల చెలిమె ను దర్శించుకున్న సిఐ



బనగానపల్లె, అక్టోబర్ 22, పల్లెవెలుగు మండలంలోని యాగంటి సమీపంలో ఉన్న మారునీళ్ళ చెలిమే దేవస్థానాన్ని బనగానపల్లె రూరల్ సిఐ మంజునాథరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. బుధవారం సీఐ మంజునాథ రెడ్డి దంపతులు మారునీళ్లచెలినలోని పార్వతి దేవి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బత్తుల సుమ స్వామివారి చిత్రపటాన్ని వారికి అందజేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బత్తుల రామకృష్ణారెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.

## కత్తిపూడి రోడ్డు ప్రమాదంపై మంత్రి బీసీ దిగ్భ్రాంతి




బనగానపల్లె, అక్టోబర్ 22, పల్లెవెలుగు కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు గురువారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కత్తిపూడి రోడ్డు ప్రమాదం బాధాకరమని తెలిపారు.రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన భవానీ భక్తులు మృతి చెందడం పట్ల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.భవానీ భక్తుల మృతిపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంతాపం తెలిపి,మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి బీసీ తెలిపారు.

## నూతన గృహప్రవేశం నకు హాజరయిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె, అక్టోబర్ 22,పల్లెవెలుగు బనగానపల్లె మండలం చెర్లోకొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ధనియాల బాబయ్య ఆహ్వానం మేరకు, నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి ఈ సందర్భంగా ధనియాల బాబయ్య గారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి ఆకాంక్షించారు.

## రెండవ రోజు నామినేషన్లు నీల్



బనగానపల్లె, అక్టోబర్ 22, పల్లెవెలుగు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెండవ రోజు కూడా ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్ వేయలేదు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ రెండవ రోజు కూడా నామినేషన్లు ఎవరు వేయలేదని తెలిపారు. నామినేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బనగానపల్లె ,నందివర్గం ఎస్సై లు కల్పన, భూపాలుడు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఎంపీటీసీ స్థానాలకు 9 నామినేషన్లు దాఖలు.

దొర్నిపాడు అక్టోబర్ 22 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయం నందు గురు వారం మండలంలోని ఏడు ఎంపిటిసి స్థానాలకు గాను 9 నామినేషన్లు ఆర్వో. నాగ రాజు సమక్షంలో దాఖలు చేసినట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు.. రేపటితో చివరి రోజు కావడం అయినందునమిగతా స్థానాలకు నామినేషన్లు వేసుకోవచ్చు అని తెలిపారు,జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ న్నామినేషన్ల ప్రక్రియనుపరిశీలించారు. ఎస్సై వరప్రసాద్ నేతృత్వంలో గట్టి పోలీస్ బందోస్తవం ఏర్పాటు చేశారు



## పోరుమామిళ్ల-1 ఎంపీటీసీకి జనసేన నామినేషన్



పోరుమామిళ్ల, అక్టోబర్ 22 ( పల్లె వెలుగు ):స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోరుమామిళ్ల మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు మండలంలో వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల వివరాల ప్రకారం తెలుగుదేశం పార్టీ నుంచి 25, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 2, బీజేపీ నుంచి 1, జనసేన పార్టీ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థిగా 1 నామినేషన్ దాఖలైంది. మొత్తంగా 30 నామినేషన్లు నమోదయ్యాయి. ఇందులో పోరుమామిళ్ల-1 ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరఫున శీలంశెట్టి లక్ష్మయ్య నామినేషన్ దాఖలు చేశారు. మండలంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో స్థానిక రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

## ఆళ్లగడ్డ జనసేన జడ్పీటిసి అభ్యర్థిగా
### ఇరిగేలా సూర్యనారాయణ రెడ్డి నామినేషన్ దాఖలు

**జనసేన పార్టీ అభ్యర్థులు జెడ్పిటిసి లకు నామినేషన్లు దాఖలు**

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 22, పల్లె వెలుగు ఆళ్లగడ్డ జనసేన పార్టీ సీనియర్ నాయకులు




సమన్వయకర్త ఇరిగెల రాంపుల్లారెడ్డి సూచన మేరకు ఆళ్లగడ్డ జెడ్పీటీసీ అభ్యర్థిగా ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల జయోంద్ర రెడ్డి,
అలాగే చాగలమర్రి జెడ్పీటీసీ అభ్యర్థిగా కోత మోహన్ రెడ్డి, అలాగే శిరివెళ్ళ జెడ్పీటీసీ అభ్యర్థిగా పెసరాయి చాంద్ బాషా గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఇరిగెల రాంచంద్రారెడ్డి, జున్ను ప్రసాద్ రెడ్డి, సమీర్ వలి, షరీఫ్, జనార్ధన్, లింగమయ్య గౌడ్, పెసరాయి ముహమ్మద్ జాఫర్, గౌస్, శిరివెళ్ళ న్యాయవాది రెడ్డి గారి అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పొత్తుతో కొత్త బలం 44వ వార్డులో
### సుహైల్ రానాకు ఎస్ డి పి ఐ సంపూర్ణ మద్దతు..

**-మాజీ శాసన సభ్యులు శిల్పా రవి తో ఎస్ డి పి ఐ నాయకులు కరిముల్లా**
**వైఎస్ఆర్సిపి 44వ వార్డు అభ్యర్థి సుహైల్ రానా ఆత్మీయ కలయిక,**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో




వైయస్సార్సీపి మరియు ఎస్ డి పి ఐ మధ్య కుదిరిన పొత్తులో భాగంగా 44వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థి యువ న్యాయవాది సుహైల్ రానాకు ఎస్ డి పి ఐ తన మద్దతు ప్రకటించింది. పొత్తు నిర్ణయం మేరకు 44వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి ఎస్ డి పి ఐ నాయకులు,కార్యకర్తలు సహకరించనున్నారు. రెండు పార్టీల మధ్య కుదిరిన ఈ రాజకీయ అవగాహనతో వార్డులో ఎన్నికల ప్రచారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా 44వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుహైల్ రానా విజయానికి మద్దతుగా నిలవడం రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన పరిణామంగా 44వ వార్డు ప్రజలు భావిస్తున్నారు.

## కనకవీడు ఎంపీటీసీ 1,2 అభ్యర్థిగా నామినేషన్ దాఖలు,

నందవరం , పల్లె వెలుగు అక్టోబర్ 22 నందవరం మండలంలో వివిధ గ్రామాల్లో



నామినేషన్లు కనకవీడు గ్రామ ఎంపీటీసీ 2.సీనియర్ నాయకులు రఘుమూర్తి స్వామి సతీమణి కే గీతా బాయ్,ఎంపీటీసీ 1.గా సందుల దానమ్మ తెలుగుదేశం పార్టీ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో, వారు నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. టీడీపీ నాయకత్వం సూచనల మేరకు ఎంపీటీసీ గా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, దస్తగిరి శివన్న, పెద్దయ్య గౌడు, వెంకటరాముడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ అభ్యర్థులుగా 22 నామినేషన్లు







మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని పదకొండు ఎంపీటీసీ స్థానాలకు రెండవ రోజు 22 నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. గురువారం తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం ప్రారంభమైంది. ఎంపీటీసీ స్థానాలకు గాజులపల్లె నుంచి గంగవరపు సత్య, షేక్ దిల్షాద్ బేగం, తిమ్మాపురం ఉల్లి మధుమణి-2, నూలు నారాయణమ్మ, తమ్మడపల్లె దేవరశెట్టి రామకృష్ణుడు, కొండపల్లి నాగభూషణం రెడ్డి, అబ్బీపురం భాష్యం కృష్ణ గౌడ్, గోపవరం ఎన్. వెంకటేశ్వరమ్మ, బుక్కాపురం బుడ్డారెడ్డి యశస్విని, బుడ్డా రెడ్డి శ్రీనివాస రెడ్డి, సీతారామపురం శివ కేశవరావు, ఆనందరావు తెలుగుదేశం పార్టీ తరఫున నామినేషన్లు వేశారు. తమ్మడపల్లె కొమ్మ వెంకటసుబ్బారెడ్డి, మసీదుపురం ఆవుల లక్ష్మీదేవి, ఆవుల లక్ష్మీ ప్రసన్న, పెరుమాళ్ళ అనిత, తిమ్మాపురం పెద్ది స్వరూప, అబ్బీపురం నూర్ భాషా, గోపవరం శ్రీదేవి, సీతారామపురం వెంకటేశ్వర్లు, బుక్కాపురం నాగప్రసాద్ వైఎస్ఆర్సిపి పార్టీ నుంచి నామినేషన్లు వేశారు. సీఐ ఇస్మాయిల్,ఎస్సై శివాంజల్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికే అవమానం: నామినేషన్ ఉపసంహరణ పేరుతో ఫోర్జరీ దందా!..

**జేసీకి ఫిర్యాధు చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష..**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నామినేషన్ ఉపసంహరణ పేరుతో ఫోర్జరీ దందా నిర్వహించిన, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నిప్పులు జరిగారు.
51వ వార్డు వైసీపీ అభ్యర్థి అవ్వారి నాగమణికి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మద్దతుగా పోరాటం నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష జెసికి ఫిర్యాదు చేశారు.
నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తీరు తీవ్ర విస్మయాన్ని, దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. అసలేం జరిగింది? ఫోర్జరీ వివాదంపై శిల్పా రవిరెడ్డి మున్సిపల్ కమిషనర్ ను నిలదీశారు. నంద్యాల మున్సిపాలిటీలోని 51వ వార్డు వైసీపీ అభ్యర్థి అవ్వారి నాగమణి నామినేషన్ విషయంలో సాగిన వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష నేడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ని కలిసి 51వ వార్డు వైసీపీ అభ్యర్థి అవ్వారి నాగమణికి జరిగిన అన్యాయాన్ని వివరించి లిఖిత పూర్వకంగా ఫిర్యాధు చేశారు. ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, అడ్వకేట్స్ కృష్ణరెడ్డి, మాధవరెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ..."నంద్యాల 51వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అవ్వారి నాగమణి నామినేషన్‌ను ఆమెకు తెలియకుండానే ఉపసంహరించుకున్నట్లు, ప్రపోజర్ లను భయపెట్టి విత్డ్రా చేసినట్లు సంతకాలు చేయించడం ఏకగ్రీవంగా గెలిచినట్లు ప్రకటించుకోవడం ఏ తరహా ప్రజాస్వామ్యం?" అని ప్రశ్నించారు. జరిగిన విషయంపై మున్సిపల్ కమిషనర్, సంభందిత ఆర్వో సమాధానంచెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే అదే వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మహిళా అభ్యర్థిని భాలవంతంగా తీసుకొచ్చి నామినేషన్ విత్డ్రా చేయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రౌడీయిజంతో ఎన్నికలను ఏకపక్షం చేయాలనుకుంటున్న అధికార పక్షానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, దౌర్జన్యాలను ఆపాలని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను తాము పూర్తినమ్మకంతో స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం తన అణచివేత ధోరణిని వీడాలని స్పష్టం చేశారు. 51వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అవ్వారి నాగమణి కి న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ను కోరడం జరిగిందని, జిల్లా కలెక్టర్ తో చర్చించి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారన్నారు.

## నోరూరించే కొబ్బరి పాల అన్నం.. ఇలా చేస్తే 10 నిమిషాల్లోనే అయిపోతుంది

కావాల్సిన పదార్థాలు: బాస్మతి బియ్యం: 1 గ్లాసు, కొబ్బరి తురుము: అర కొబ్బరికాయ నుండి, నీరు: కొబ్బరి పాలు తీయడానికి 1 గ్లాసు, అన్నం ఉడికించడానికి అదనంగా అర గ్లాసు, నూనె: 1 టేబుల్ స్పూన్, నెయ్యి: అర టేబుల్ స్పూన్ , బిర్యానీ ఆకు: 1,
దాల్చిన చెక్క: 2 చిన్న ముక్కలు, లవంగాలు: 4, యాలకులు: 3, అనాస పువ్వు: 1, జాపత్రి: కొద్దిగా, షాజీరా: 1 టీ స్పూన్,
పచ్చిమిర్చి: 4-5 (రుచికి సరిపడా), ఉల్లిపాయ: 1 చిన్నది, సన్నగా తరిగినది, అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టీ స్పూన్, పుదీనా తరుగు: కొద్దిగా
కొత్తిమీర తరుగు: కొద్దిగా, ఉప్పు: రుచికి సరిపడా, గరం మసాలా పౌడర్/బిర్యానీ మసాలా పౌడర్: 1 టీ స్పూన్
కావాల్సిన పదార్థాలు: బాస్మతి బియ్యం: 1 గ్లాసు, కొబ్బరి తురుము: అర కొబ్బరికాయ నుండి, నీరు: కొబ్బరి పాలు తీయడానికి 1 గ్లాసు, అన్నం ఉడికించడానికి అదనంగా అర గ్లాసు, నూనె: 1 టేబుల్ స్పూన్, నెయ్యి: అర టేబుల్ స్పూన్ , బిర్యానీ ఆకు: 1, దాల్చిన చెక్క: 2 చిన్న ముక్కలు, లవంగాలు: 4, యాలకులు: 3, అనాస పువ్వు: 1, జాపత్రి: కొద్దిగా, షాజీరా: 1 టీ స్పూన్, పచ్చిమిర్చి: 4-5 (రుచికి సరిపడా), ఉల్లిపాయ: 1 చిన్నది, సన్నగా తరిగినది, అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టీ స్పూన్, పుదీనా తరుగు: కొద్దిగా కొత్తిమీర తరుగు: కొద్దిగా, ఉప్పు: రుచికి సరిపడా, గరం మసాలా పౌడర్/బిర్యానీ మసాలా పౌడర్: 1 టీ స్పూన్ ముందుగా, ఒక గ్లాసు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తిరిగి నీరు పోసి కనీసం అరగంట పాటు నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల అన్నం పొడిపొడిలాడుతూ వస్తుంది. అర కొబ్బరికాయ చిప్పను సులభంగా తీయడానికి ఒక రోజు ముందు ఫ్రిజ్‌లో ఉంచండి. కొబ్బరిని సన్నగా పొడవుగా కట్ చేసుకోవాలి. ఇది గ్రైండ్ చేయడానికి ఈజీగా ఉంటుంది.
ముందుగా, ఒక గ్లాసు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తిరిగి నీరు పోసి కనీసం అరగంట పాటు నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల అన్నం పొడిపొడిలాడుతూ వస్తుంది. అర కొబ్బరికాయ చిప్పను సులభంగా తీయడానికి ఒక రోజు ముందు ఫ్రిజ్‌లో ఉంచండి. కొబ్బరిని సన్నగా పొడవుగా కట్ చేసుకోవాలి. ఇది గ్రైండ్ చేయడానికి ఈజీగా ఉంటుంది.
సన్నగా కట్ చేసిన కొబ్బరిని బ్లెండర్‌లో వేసి, మొదట అర గ్లాసు నీరు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జ్యూస్ వడకట్టుకునే దానిలోకి వేసి స్పూన్‌తో నొక్కుతూ పాలను సేకరించండి. మిగిలిన పిప్పిని తిరిగి బ్లెండర్‌లో వేసి, మిగిలిన అర గ్లాసు నీటిని కూడా వేసి మరొకసారి గ్రైండ్ చేసి, పాలను వడకట్టండి. ఇలా రెండుసార్లు వడకట్టడం వల్ల కొబ్బరి పాలు పూర్తిగా బయటకు వస్తాయి. మొత్తం ఒక గ్లాసు కొబ్బరి పాలు సిద్ధమవుతాయి.
సన్నగా కట్ చేసిన కొబ్బరిని బ్లెండర్‌లో వేసి, మొదట అర గ్లాసు నీరు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జ్యూస్ వడకట్టుకునే దానిలోకి వేసి స్పూన్‌తో నొక్కుతూ పాలను సేకరించండి. మిగిలిన పిప్పిని తిరిగి బ్లెండర్‌లో వేసి, మిగిలిన అర గ్లాసు నీటిని కూడా వేసి మరొకసారి గ్రైండ్ చేసి, పాలను వడకట్టండి. ఇలా రెండుసార్లు వడకట్టడం వల్ల కొబ్బరి పాలు పూర్తిగా బయటకు వస్తాయి. మొత్తం ఒక గ్లాసు కొబ్బరి పాలు సిద్ధమవుతాయి ఒక గ్లాసు బాస్మతి బియ్యానికి ప్రెషర్ కుక్కర్‌లో ఒకటిన్నర గ్లాసుల నీరు సరిపోతుంది. కాబట్టి, వచ్చిన ఒక గ్లాసు కొబ్బరి పాలకు అదనంగా అర గ్లాసు నీటిని కలిపి పెట్టుకోవాలి. ఒకవేళ మీరు బాస్మతి బియ్యానికి బదులుగా రెగ్యులర్ బియ్యం ఉపయోగిస్తే, ఒక గ్లాసు బియ్యానికి ప్రెషర్ కుక్కర్‌లో రెండు గ్లాసుల నీరు అవసరం అవుతుంది. కడాయిలో వండితే బాస్మతికి రెండు గ్లాసులు, రెగ్యులర్ రైస్‌కి రెండున్నర గ్లాసులు అవసరం. స్టవ్ మీద ప్రెషర్ కుక్కర్ పెట్టి, అందులో ఒక టేబుల్ స్పూన్ నూనె, అర టేబుల్ స్పూన్ నెయ్యి వేయండి. నెయ్యి ఇష్టం లేని వారు పూర్తిగా నూనెను వాడవచ్చు. నూనె వేడి అయిన తర్వాత, బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, అనాస పువ్వు, జాపత్రి, షాజీరా వేసి, ఒక నిమిషం పాటు తక్కువ మంటపై వేయించాలి. ఒక గ్లాసు బాస్మతి బియ్యానికి ప్రెషర్ కుక్కర్‌లో ఒకటిన్నర గ్లాసుల నీరు సరిపోతుంది. కాబట్టి, వచ్చిన ఒక గ్లాసు కొబ్బరి పాలకు అదనంగా అర గ్లాసు నీటిని కలిపి పెట్టుకోవాలి. ఒకవేళ మీరు బాస్మతి బియ్యానికి బదులుగా రెగ్యులర్ బియ్యం ఉపయోగిస్తే, ఒక గ్లాసు బియ్యానికి ప్రెషర్ కుక్కర్‌లో రెండు గ్లాసుల నీరు అవసరం అవుతుంది. కడాయిలో వండితే బాస్మతికి రెండు గ్లాసులు, రెగ్యులర్ రైస్‌కి రెండున్నర గ్లాసులు అవసరం. స్టవ్ మీద ప్రెషర్ కుక్కర్ పెట్టి, అందులో ఒక టేబుల్ స్పూన్ నూనె, అర టేబుల్ స్పూన్ నెయ్యి వేయండి. నెయ్యి ఇష్టం లేని వారు పూర్తిగా నూనెను వాడవచ్చు. నూనె వేడి అయిన తర్వాత, బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, అనాస పువ్వు, జాపత్రి, షాజీరా వేసి, ఒక నిమిషం పాటు తక్కువ మంటపై వేయించాలి.

# అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా స్థానిక పోరుకు సై..

జగ్గంపేట, అక్టోబర్ 22 పల్లె వెలుగు అభివృద్ధి,



సంక్షేమమే అజెండాగా స్థానిక సంస్థల ఎన్నికల సంగ్రామానికి సిద్ధమయ్యామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు, అమలాపురం రూరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు పూర్తయిందని తెలిపారు. మొత్తం 80 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ 63, జనసేన 15, బీజేపీ 2 స్థానాల్లో పోటీ చేస్తాయని ప్రకటించారు. నాలుగు జడ్పీటీసీ స్థానాలకు గాను టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో పోటీ చేస్తాయని వెల్లడించారు. జగ్గంపేట నుంచి జీను మణిబాబు, కిర్లంపూడి నుంచి తోట రవి, గోకవరం నుంచి డాక్టర్ టీనా కేర్లిన్ టీడీపీ అభ్యర్థులుగా, గండేపల్లి నుంచి జనసేన అభ్యర్థిగా మంగిన గని లక్ష్మి బరిలో ఉన్నారని ప్రకటించారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఎన్నికలకు వెళ్తామన్నారు. పొత్తులు, రిజర్వేషన్ల కారణంగా సీట్లు త్యాగం చేసిన నాయకులకు భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఎన్నికలకు సహకరించిన జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ, బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ లేకనే స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు జరిగితే 16వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే అక్కసుతోనే జగన్ ఇలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అల్లాడ స్వామి నాయుడు మాట్లాడుతూ, సీనియర్ నాయకుడైన జ్యోతుల నెహ్రూ కూటమిలో ఎలాంటి విభేదాలు లేకుండా అందరికీ ఆమోదయోగ్యంగా అభ్యర్థులను ఎంపిక చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపా భరత్, కన్నబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, ఘాజింగం సత్తిబాబు, కొత్తపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు

# గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ రహిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

రాజమండ్రి, అక్టోబర్ 22 పల్లె వెలుగు రానున్న



గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్లాస్టిక్ రహిత విధానంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ఆర్. కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి అధికారులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమల ప్రతినిధులతో పుష్కరాల తాగునీటి సరఫరా, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా స్థానిక రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ (ఆర్ఎంసీ) కార్యాలయం నుంచి పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు తాగునీటి వసతుల కల్పనకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ వివరించారు. పుష్కరాల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో జిల్లాకు సుమారు 80 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో భక్తునికి కనీసం మూడు లీటర్ల తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ వివరించారు. పుష్కర నగరాలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో వాటర్ పాయింట్లు, వాటర్ ఏటీఎంలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన నడక మార్గాల్లో ప్రతి 500 మీటర్లకు ఒక రక్షిత తాగునీటి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా సుమారు 32 వేల ట్యాప్ అవుట్‌లెట్లు, 3 వేల వాటర్ ఏటీఎంల ఏర్పాటును ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు గోదావరిలో కలవకుండా చర్యలు పుష్కరాల సమయంలో వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్ల వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. తాగునీటి రీఫిల్లింగ్ కేంద్రాలను ప్రోత్సహించడంతో పాటు ప్లాస్టిక్ గ్లాసుల స్థానంలో స్టీల్ లేదా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదానాలు, ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాల్లోనూ ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని నివారించాలని పేర్కొన్నారు. భక్తులు తమ వెంట తెచ్చుకునే వాటర్ బాటిళ్లను తిరిగి నింపుకునేందుకు రీఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని చైర్మన్ ఆర్. కృష్ణయ్య సూచించారు. తిరుమలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ అమలును స్ఫూర్తిగా తీసుకుని గోదావరి పుష్కరాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. రెండు వారాల్లో మరోసారి సమావేశం నిర్వహిస్తామని, ఈలోగా తాగునీటి సరఫరాకు సంబంధించి వినూత్నమైన, పర్యావరణహిత పరిష్కారాలతో ముందుకు రావాలని సంబంధిత ఏజెన్సీలను కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్, ఎస్ఈ రీటా, ఈఈ మాధవి, సంబంధిత అధికారులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు

# వైసీపీకి షాక్.. టీడీపీలోకి 150 మంది చేరిక

రాజమహేంద్రవరం, అక్టోబర్ 22 పల్లె వెలుగు



నగరంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నందం స్వామి ఆధ్వర్యంలో 35, 39వ డివిజన్లకు చెందిన వారు పార్టీలో చేరగా, హితకరిణి సమాజం చైర్మన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలో చేరిన వారందరికీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీడీపీ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించడమే నిజమైన నాయకత్వ లక్షణమన్నారు. ప్రజలే దేవుడు, సమాజమే దేవాలయం అనే సిద్ధాంతంతో సేవలు అందిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా వేధిస్తున్న వర్షపు నీటి ముంపు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కంబాల చెరువు నుంచి నల్లా ఛానల్ వరకు ప్రధాన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు, పాత డ్రైన్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే 35, 36, 39వ డివిజన్లతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ముంపు నుంచి ఉపశమనం లభిస్తుందని వివరించారు. నగరంలో రహదారులు, విద్యుత్ సదుపాయాలతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని, గోదావరి గట్టు వెంబడి భూగర్భ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నూతనంగా పార్టీలో చేరిన వారంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరగాని వేణు, మాలే విజయలక్ష్మి, యాళ్ల వెంకటరావు, గొర్రెల రమణి, చాపల నాగమణి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు

## దేవీపట్నం జెడ్పీటీసీ అభ్యర్థిగా కుంజం రాజామణి నామినేషన్

దేవీపట్నం, అక్టోబర్ 22పల్లె వెలుగు పోలవరం జిల్లా రంపచోడవరం



నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉత్సాహంగా తమ నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. గురువారం దేవీపట్నం జెడ్పీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా కుంజం రాజామణి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు లాంఛనంగా సమర్పించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో దేవీపట్నం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొల్ల చంటిబాబు, పార్టీ సీనియర్ నాయకులు తైలం గంగాధర్, మాదాపూ బాబు రావు, మధు, నగేష్ లతో పాటు కూటమి పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఆక్రమణల కోరల్లో సంత చెరువు.. ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

కాట్రేనికోన, అక్టోబర్ 22 పల్లె వెలుగు మండల కేంద్రమైన కాట్రేనికోన గ్రామ



పంచాయతీ సమీపంలో ఉన్న సంత చెరువు భారీ వర్షాలకు పొంగింది. చెరువులోని నీరు చుట్టుపక్కల నివాస గృహాల్లోకి ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నీరు నీరుగేట్ సెంటర్లోని ప్రధాన డ్రైనేజీ గుండా ఓల్డ్ అయినాపురం డ్రైన్‌లో కలవాల్సి ఉంటుంది. కానీ డ్రైనేజీలో చెత్తాచెదారం అడ్డుకోవడంతో ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. సుమారు ఐదెకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ సంత చెరువు పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఈ ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీలు శుభ్రం చేసి ఆక్రమణలు అరికట్టకపోతే భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారీ ముంపు సమస్య తప్పదని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## తేలని లెక్కలు.. స్థానిక సమరంలో లెక్కకు మించి నామినేషన్లు




కొవ్వూరు, అక్టోబర్ 22 పల్లె వెలుగు నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ నుంచి ఎవరు పోటీ చేయాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో టీడీపీ సహా కూటమి పార్టీల ఆశావహుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. నామినేషన్ల ఘట్టం చివరి దశకు చేరుకోవడం, మంచి ముహూర్తాలు మించిపోతుండటంతో అభ్యర్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. తాళ్లపూడి మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ, ఎంపీపీ, భవిష్యత్తులో సర్పంచ్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులను కొవ్వూరు అధిష్టానం ఇంకా ఖరారు చేయలేదు. నామినేషన్ల ప్రక్రియకు కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో ఆయా పార్టీల ఆశావహులు సీటు తమకే దక్కుతుందన్న భరోసాతో భారీగా నామినేషన్లు వేస్తున్నారు. టీడీపీ ఆశావహులు సైతం ముందస్తు జాగ్రత్తగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. సీట్ల కేటాయింపుపై ముందే స్పష్టత ఇస్తే సుమారు 30 నామినేషన్లు మాత్రమే పడేవి. కానీ, ఏకంగా 70కి పైగా నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. చివరి రోజున మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. ఈ గందరగోళానికి తెరదించుతూ, ఏ పార్టీకి ఏ స్థానం కేటాయించారో అధిష్టానం తక్షణమే ప్రకటించి అభ్యర్థుల ఆత్రుతకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

## ఎంపీటీసీ అభ్యర్థిగా గుండుబోగుల దుర్గ నాగిని నామినేషన్



తాళ్లపూడి, అక్టోబర్ 22 పల్లె వెలుగు తాళ్లపూడి ఎంపీటీసీ రెండు స్థానానికి కూటమి అభ్యర్థిగా గుండుబోగుల దుర్గ నాగిని గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం మండలంలో ఆసక్తికరంగా మారుతోంది. ఇందులో భాగంగా గుండుబోగుల దుర్గ నాగిని తన మద్దతుదారులతో కలిసి స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను అధికారులకు లాంఛనంగా సమర్పించారు. ఈ సందర్భంగా గుండుబోగుల దుర్గ నాగిని మాట్లాడుతూ బాబు నాయుడు చేసిన మంచి పనులను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి బలంగా తీసుకువెళ్తే ఎన్నికల్లో మనకు తప్పక మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రజల మద్దతు కూటమికి పూర్తి స్థాయిలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు

## నామినేషన్ కేంద్రం వద్ద భద్రతపై ఎస్పీ నరసింహ కిశోర్ అసంతృప్తి

తాళ్లపూడి, అక్టోబర్ 22పల్లె వెలుగు మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎంపీటీసీ



నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తును జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలను పరిశీలించిన ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్ కేంద్రం పరిసరాల్లో రోడ్లపై జనాలు గుమికూడి ఉండటం గమనించిన ఆయన, 144వ సెక్షన్ అమలులో ఉందా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ నరసింహ కిశోర్, అక్కడున్న వాహనాలు, టెంట్లను తక్షణమే తొలగింపజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి, బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధి నిబంధనను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నాయకులు ఎక్కువ సేపు ఒకే చోట గుమికూడితే మాటల ద్వారా ఘర్షణలకు దారి తీసే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఎంపీటీసీ అభ్యర్థి మేడపాటి స్వాతి శ్రీనివాసరెడ్డి విస్తృత ప్రచారం

మహేంద్రవాడ, అక్టోబర్ 22 పల్లె వెలుగు మహేంద్రవాడ ఎంపీటీసీ-2 ఎన్నికల ప్రచారంలో



భాగంగా వైఎస్సార్సీపీ అభ్యర్థి మేడపాటి స్వాతి శ్రీనివాసరెడ్డి శుక్రవారం గ్రామంలో విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలను నేరుగా కలుసుకుని, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి కీలక అంశాలపై ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రచారంలో వివరించారు. ప్రజలతో మమేకమవుతూ వారి ఆశీస్సులు, మద్దతు కోరుతూ ప్రచారాన్ని ముందుకు సాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ అధ్యక్షుడు మల్లిడి గంగరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతాంశెట్టి శ్రీనివాసరెడ్డి, మాజీ వార్డు సభ్యులు సత్తి బుల్లిగంగిరెడ్డి, మల్లిడి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, సబ్బెళ్ల సత్తిరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

## రెండో రోజు జోరుగా కూటమి అభ్యర్థుల నామినేషన్లు

రాజవొమ్మంగి, అక్టోబర్ 22 పల్లె వెలుగు పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో



జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం అత్యంత జోరుగా సాగుతోంది. గురువారం రెండవ రోజు కూటమి అభ్యర్థులు తమ నామినేషన్లను ఉత్సాహంగా దాఖలు చేశారు. ఇందులో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భర్త మఠం విజయ్ భాస్కర్ రాజవొమ్మంగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా గురువారం లాంఛనంగా నామినేషన్ వేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో రంపచోడవరం మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్, రంపచోడవరం మండల ప్రెసిడెంట్ అనంత మోహన్, మాజీ సర్పంచ్ వై నిరంజన్ దేవి, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత తదితరులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు

## బూరుగుపూడి ఎంపీటీసీ అభ్యర్థిగా నక్కా రాంబాబు నామినేషన్



కిర్లంపూడి, అక్టోబర్ 22 పల్లె వెలుగు బూరుగుపూడి గ్రామ పంచాయతీ పరిధిలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థిగా నక్కా రాంబాబు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. కీర్తిశేషులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు నక్కా ఆదినారాయణ తృతీయ కుమారుడైన నక్కా రాంబాబును తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పాఠంశెట్టి రవి, శివకేశవుల ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ కుంచె తాతాజీ బలపరిచారు. అనంతరం నక్కా రాంబాబు మాట్లాడుతూ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులు, పెద్దల సహకారంతో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. బూరుగుపూడి అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, నిరంతరం ప్రజా సేవే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించి ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి గణేష్, పాఠంశెట్టి విశ్వనాథం, పాఠంశెట్టి మీసాల నాగేశ్వరరావు, పాఠంశెట్టి లక్ష్మణమూర్తి బుజ్జి, కర్నాకుల సత్తిబాబు, మోర సత్తిబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి పాఠంశెట్టి కొండరాజులు, పాఠంశెట్టి తమ్మారావు, పాఠంశెట్టి భీమరాజు, అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com